క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. మల్లారెడ్డిపల్లికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుక లోడ్‌తో వెళ్తుండగా చల్లూరు గ్రామ శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ రైతుకు సన్మానం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు వంగల వెంకట్‌రెడ్డి రేడియో కిసాన్ దినోత్సవం పురస్కరించుకొని వరంగల్‌లోని ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో ఉత్తమ రైతుగా అవార్డు అందుకున్నారు. వరంగల్ రీజినల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వరంగల్ ఆకాశవాణి రేడియో కేంద్రం ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డి.రవికుమార్ చేతుల మీదుగా గురువారం అవార్డు స్వీకరించారు. పంటల సాగులో నూతన వంగడాలు, ఆధునిక పద్ధతులు పాటించటంతో పాటు తోటి రైతులకు అవగాహన కల్పిస్తున్నందుకు అవార్డు పొందారు. అనంతరం ఉత్తమ రైతును ఘనంగా సన్మానించారు.

దుస్తులు పంపిణీ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గ్రామ పంచాయతీ కార్మికులకు మంజూరైన దుస్తులను గురువారం ఎంపీపీ చిలుక రవీందర్ పంపిణీ చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పారిశుధ్య కార్యక్రమాల ముగింపు సమావేశం నిర్వహించగా కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె విజయవంతం చేయండి

చొప్పదండి: ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు కోరారు. కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా, దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించనున్నారని, కరీంనగర్ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మండలంలోని రుక్మాపూర్‌లో ఉపాధి హామీ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవ్వంపల్లి అజయ్ పాల్గొన్నారు.

మామిడాలపల్లి హెచ్‌ఎంకు జాతీయ పురస్కారం

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుద్దాల శోభారాణి నేషనల్ ఇన్నోవేటివ్ శిక్షారత్న్ జాతీయ పురస్కారానికి ఎంపికై ంది. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గతి విద్యార్థ్ సమూహ సంస్థ పురస్కారాన్ని ఏటా అందిస్తోంది. విద్యార్థుల్లో శాస్త్ర సంకేతిక నైపుణాలు, గుణాత్మక నైతిక విలువలు పెంపొందించడంతో పాటు పలు విద్యా సామాజిక సేవలలో శోభారాణి పాల్గొన్నందుకు పురస్కారం వరించినట్లు సంస్థ ప్రతినిధి నవీన్‌చారి ప్రకటించారు. పురస్కారానికి ఎంపికవ్వడం పట్ల యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పీఎం విశ్వకర్మ యోజన ప్రతులు అందజేయండి

జమ్మికుంట: పీఎం విశ్వకర్మ యోజన పథకం కోసం చేతివృత్తుల ఆధారంగా జీవనం సాగించేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అందుకు సంబంధించిన ప్రతులను పాత మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, మేనేజర్ భూపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అప్లికేషన్ ఫారం, ఆధార్, రేషన్ కార్డు, కులం ధ్రువీకరణ, యూనిట్ ఫొటో, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు కార్యాలయంలోని అధికారులకు అందజేయాలన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డు అధికారికి అస్వస్థత

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో వార్డు అధికారిగా పనిచేస్తున్న రంజిత్‌కుమార్ అస్వస్థతకు గురయ్యారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని బిల్లింగ్ సెక్షన్ వద్ద అకస్మాత్తుగా కింద పడిపోయారు. సహచర ఉద్యోగులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంది.

కల్లు దుకాణం నిలిపేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్ మారుతినగర్‌లో ఇళ్ల మధ్య కల్లు దుకాణం ఏర్పాటు యత్నం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఉన్న వైన్స్‌షాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మళ్లీ కల్లు దుకాణం కూడా తోడైతే నివాసం ఉండడం కూడా కష్టమేనంటూ మారుతినగర్ ప్రజలు వాపోతున్నారు. ఈమేరకు గురువారం ఎక్సైజ్ కమిషనర్‌కు కార్పొరేటర్ నేతికుంట యాదయ్య ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతిపత్రం అందచేశారు. వైన్స్‌షాప్ కారణంగా మహిళలు రోడ్లపై నడవాలంటే కష్టంగా ఉందని తెలిపారు. ఇప్పుడు కల్లు దుకాణం ఏర్పాటుతో మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, కల్లు దుకాణ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు.

ఇంటర్నల్ మార్కులు పరిశీలన



రామడుగు: రికార్డులను పరిశీలిసున్న ఉపాధ్యాయ ప్రత్యేక బృందం సభ్యులు



హుజూరాబాద్‌లో విద్యార్థుల మార్కులను పరిశీలిస్తున్న బృందం అధికారులు

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కేజీబీవీలో గురువారం ప్రత్యేక ఉపాధ్యాయ బృందం సభ్యులు పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలించారు. ప్రతి విద్యార్థి రికార్డులను పరిశీలించి మార్కులు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, అవధూత శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్, పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను ప్రత్యేక బృందం సభ్యులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పరీక్ష మార్కులను, పరీక్ష పుస్తకాలను, ప్రాజెక్ట్ వర్క్‌లను, కో కరికులంకు సంబంధించినవి పరిశీలించామని ఎంఈవో కేతిరి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. తనిఖీల్లో బృందం అధికారి ఇ.అనురాధ, టీం మెంబర్స్ ఎం.సుధాకర్, ఎన్.నరేంద్రచారి ఉన్నారు.

'పది' విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు పాడిశెట్టి అభిలాశ్ తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పరీక్ష నిర్వహించామని, ఎస్‌ఎఫ్‌ఐ కేవలం విద్యార్థి సమస్యలపై పోరాటాలే కాకుండా విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గజ్జల సందీప్, మండల అధ్యక్షుడు సాయి నిఖిల్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో బీఎస్పీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

జమ్మికుంట: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని జాన్వాడలో క్రిస్టియన్, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల మీద జరిగిన దాడి పట్ల పరామర్శకు వెళ్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసాల రామస్వామి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఫ్లైవోవర్ బ్రిడ్జి ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మతోన్మాద గుండాలను రక్షించేందుకే అరెస్టు చేశారని ఆరోపించారు. క్రిస్టియన్, మైనార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దిలీప్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, అసెంబ్లీ ఇంచార్జి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మంద సమ్మయ్య, జిల్లా మహిళా కన్వీనర్ స్వప్న, ఈసీ మెంబర్ నరేష్, వీణవంక, హుజూరాబాద్ మండలాల అధ్యక్షులు కుమార్‌యాదవ్, మహేందర్, నాయకులు రమేష్, తిరుపతి, శ్రీనివాస్, అజయ్‌కుమార్ ,నేరరాజు, సదానందం, రవి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న పత్తి క్రిష్ణారెడ్డి



జమ్మికుంటలో...

హుజూరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిల్లర ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయటం మానుకోవాలని టీపీసీసీ మెంబర్ పత్తి క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వివిధ పదవులను అధిరోహించి పదవులకే వన్నె తెచ్చిన పొన్నంపై చిల్లర వ్యాఖ్యలు చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. ఫ్యామిలీ సెంటిమెంట్‌తో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం నియోజకవర్గ ప్రజలందరికి తెలుసని, సీఎం, మంత్రిపై మరోసారి వ్యాఖ్యలు చేస్తే నిరసనలు తీవ్ర స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, నాయకులు ,తదితరులు ఉన్నారు. మంత్రి విమర్శిస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు,సీనియర్ నాయకులు, తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో పార్టీ నాయకులతో మాట్లాడారు. పార్టీ, నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేశ్, కౌన్సిలరు రాము, సారంగం, నాయకులు పాల్గొన్నారు. మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డి లేదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న హెచ్చరించారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. తెలంగాణ కోసం కొట్లాడిన చరిత్ర పొన్నందని, ఆంధ్ర నాయకులకు తొత్తుగా తెలంగాణ ఉద్యమకారులపై రాళ్లు వేసిన ద్రోహి కౌశిక్‌రెడ్డి అని అన్నారు. కుటుంబ సభ్యులతో ప్రచారం చేసి ఎమ్మెల్యేగా ఓడిపోతే శవయాత్రకు రావాలంటూ సానుభూతితో గెలిచి విర్రవీగితే నియోజకవర్గంలో అడుగు పెట్టనీయబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు గురువారం దహనం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఫ్యామిలీ సెంటిమెంట్‌తో గెలిచిన విషయాన్ని కౌశిక్‌రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. పొన్నం ప్రభాకర్‌పై అనవసరంగా మాట్లాడితే ఊరుకోబోమన్నారు. నిరసనలో పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నానాజీ, కార్యదర్శి శంకర్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కిరణ్ రెడ్డి, కార్యదర్శి సాయి,విష్ణువర్ధన్,రత్నాకర్ రెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు లావణ్య, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్, సీనియర్ నాయకులు శంకర్, రమేష్, కిరణ్ రెడ్డి, ఐలయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాఘవేంద్ర, తిరుపతి, నాగరాజు, ఎండీ చాంద్, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విమర్శలు చేయొద్దు

వీణవంక: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కాగ్రెస్ మండల నాయకుడు పంజాల సతీశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా పార్లమెంట్‌లో గళం విప్పిన పొన్నంపై కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. బీసీల మనోభావాలు దెబ్బతినేలా కౌశిక్‌రెడ్డి మాట్లాడరని ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని కోరారు.

ఎంపీ బండి సంజయ్‌కు అయోధ్య ప్రసాదం



ప్రసాదం అందిస్తున్న ప్రవీణ్

మానకొండూర్‌రూరల్: మొదటి దశ ప్రజాహితయాత్రలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గురువారం సిరిసిల్లలో పర్యటించారు. మానకొండూర్ మండల బీజేపీ అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, మండలంలోని నాయకులు సిరిసిల్లకు వెళ్లి సంజయ్‌ను సన్మానించారు. అనంతరం, అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాములోరి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో లక్ష్మణాచారి, ప్రభాకర్, రాజిరెడ్డి, రమేశ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ బాండ్లు అందజేత



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లిఇందిరానగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరు నుంచి పదోతరగతి చవువుతున్న బాలికలకు ఆర్థిక భరోసా కల్పించాలనే కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కొడిగూటి శారద శ్రీకారం చుట్టారు. పాఠశాలలోని 30 మంది బాలికల పేరిటా రూ.5,500ల చొప్పున ఎల్‌ఐసీ చేయించారు. గురువారం ప్రవీణ్ బాలిలకు ఎల్‌ఐసీ బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ గద్దల శ్రీనివాస్, బాలికలు, బాలికల తల్లిదండ్రులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ

వీణవంక: వీణవంక ఎంపీడీవోగా మెరుగు శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా పెద్దపల్లి జిల్లాకు వెళ్లారు. ఎంపీడీవోకు వీణవంక మాజీ సర్పంచ్ నీల కుమార్, మాజీ ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్‌తో పాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మె జయప్రదం చేయాలి

ఇల్లందకుంట: తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగబోయే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘం మండల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించి ఇంటింటికీ కరప్రతాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రేణిగుంట సారయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. వివిధ డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉడుత కనకయ్య, అడెం శ్రీనివాస్, జంభికం నరేష్, రవి, గుడ్ల మొగిలి, బొయిని సారయ్య, శ్యామ్ సుందర్,రాజవీరు,సంపత్ తదితరులుపాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీ చైతన్య కళాశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అగ్నిపథ్ ఆర్మీ, పారా మిలటరీ ఫోర్స్‌కు సంబంధించి ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలోని అభ్యర్థులకు ఫిట్నెస్‌కు సంబంధించి కరీంనగర్ కు చెందిన పలు ఆసుపత్రి ఆధ్వర్యంలో 18 రకాల మెడికల్ టెస్టులు ఉచితంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. సుమారు 278 మంది మెడికల్ టెస్ట్ లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, రాధాకృష్ణ ఫిజికల్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌లో అభ్యర్థులు, నిర్వాహకులు

భూమిపూజ



భూమి పూజ చేస్తున్న పండితులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో శ్రీవీరభద్రస్వామి నూతన విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గాజుల శ్రీనివాస్ గుడికి రూ.1.30 లక్షల విలువగల ధ్వజస్తంభాన్ని బహూకరించి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠకు విరాళం



విరాళం అందజేస్తున్న దుడ్డు మల్లేశం

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో హిందూ సామ్రాట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామ్రాట్ శ్రీఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహప్రతిష్ఠ చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ దుడ్డు రేణుక, మల్లేశం రూ.25,000 వేలు, మైసంపల్లి తిరుపతి, సరిత రూ.5,016 విరాళం అందజేశారు. ఈసందర్భంగా యూత్ సభ్యులు వారిని అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్ పరిశ్రమను ఆదుకోవాలి



పవర్‌లూమ్స్‌ను పరిశీలిస్తున్న రవిశంకర్

గంగాధర: మూతపడుతున్న పవర్‌లూమ్స్ పరిశ్రమకు ప్రభుత్వం బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని గర్శకుర్తి గ్రామం పవర్‌లూమ్స్‌ను గురువారం పరిశీలించి కార్మికులు, యజమానులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. 2022లో 20 లక్షల మీటర్ల బతుకమ్మ చీరల ఉత్పత్తికి ఆర్డర్లు, 2023లో 32 లక్షలపైగా మీటర్ల చీరల తయారీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్డర్లు కల్పించిందన్నారు. వీటితో పాటు 2 లక్షలకుపైగా మీటర్ల స్కూల్ యూనిఫాం బట్ట తయారీకి, 24 వేల మీటర్ల రంజాన్ బట్టల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చామన్నారు. ఒకవైపు పవర్‌లూమ్స్‌కు ఆర్డర్లు లేక ఇబ్బంది పడుతుంటే మరోవైపు చేనేత జౌళిశాఖ విజిలెన్స్ అధికారులు పవర్‌లూమ్స్ ఉత్పత్తులపై దాడులు చేస్తూ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే కార్మికులకు ఆకలి చావులు, ఆత్మహత్యలు పునరావృత్తమయ్యే ప్రమాదముందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పవర్‌లూమ్స్ సమస్యపై స్పందించాలని అన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తున్న అధికారులు

జమ్మికుంట: మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డు, ప్రహరీని ప్రత్యేక అధికారి, జమ్మికుంట ఏవో గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి ప్రత్యూష పోలీస్‌ల సమక్షంలో గురువారం తొలిగించారు. ఈసందర్భంగా రెండేళ్ల క్రితం గ్రామ పంచాయతీ స్థలంలో నిర్మాణం చేపట్టగా పలుమార్లు జిల్లా కలెక్టర్, డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలు తొలిగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



నిర్వహణ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని నాగార్జున డెయిరీని సందర్శించారు. డెయిరీ నిర్వహణ, పాల సేకరణ, శీతలీకరణ, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ అంశాలను విద్యార్థులు అధ్యాయనం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమకుమార్ తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తే ప్రైవేట్ రంగాల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏవో సునీల్

హుజూరాబాద్‌రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న పంటలలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందస్తు నాట్లు వేసిన వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ రావుల అనిత, రైతులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఒకరిపై కేసు నమోదు

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఉన్న మామిడితోటతో పాటు షెడ్డును ధ్వంసం చేసిన సంఘటనలో తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన బొల్లం సుధాకర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై చందా నరసింహారావు తెలిపారు. పెట్రోలు బంక్‌కు సమీపంలోని మామిడి తోటలోని చెట్లు, షెడ్డు, ఇతర వాటిని బుధవారం రాత్రి జేసీబీతో ధ్వంసం చేశాడని, సుమారు రూ. 35 లక్షల నష్టం వాటిల్లిందని రిటైర్డ్ ఎస్సై నాగేశ్వర్ రావు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

దాడికేసులో ఇద్దరికి రిమాండ్

తిమ్మాపూర్: దాడి కేసులో చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన అన్నదమ్ములను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చిగురుమామిడి ఎస్సై బండి రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన సాయికిరణ్, రమేశ్ మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల రమేశ్, ఆయన సోదరుడు నవీన్ కలిసి సాయికిరణ్‌పై కత్తి, కర్రతో దాడిచేశారు. ఈ ఘటనలో సాయికిరణ్ గాయపడ్డాడు. బాధితుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేశ్, నవీన్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేష్ పేర్కొన్నారు.